ద్రవ్యోల్బణం దడ.. దడ..

అక్టోబర్‌లో 14 నెలల గరిష్ఠంగా నమోదు • ఏకంగా 6.21 శాతానికి చేరిక

ఆర్బీఐ లిమిట్ దాటేసిన ధరల సూచీ • కొండెక్కిన ఆహారోత్పత్తులే కారణం

న్యూఢిల్లీ, నవంబర్ 12: ద్రవ్యోల్బణం దడ పుట్టిస్తున్నది. గత నెలలో రిటైల్ ద్రవ్యోల్బణం ఏకంగా 14 నెలల గరిష్ఠ స్థాయిని తాకింది మరి. మంగళవారం జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్ఎస్ఓ) విడుదల చేసిన వివరాల ప్రకారం అక్టోబర్‌లో వినియోగదారుల ధరల సూచీ (సీపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణం 6.21 శాతంగా నమోదైంది. నిరుడు ఆగస్టులో 6.83 శాతంగా ఉండగా.. ఆ తర్వాత మళ్లీ ఆ స్థాయి దరిదాపుల్లో గణాంకాలు ఇదే తొలిసారి కావడం గమనార్హం. మరోవైపు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) రిటైల్ ఇన్‌ఫ్లేషన్ కట్టడికి పెట్టుకున్న గరిష్ఠ సహన పరిమితి (6 శాతం)నీ తాజా గణాంకాలు దాటేశాయి. నిజానికి గత ఏడాది సెప్టెంబర్ నుంచి ఆర్బీఐ నిర్దేశించుకున్న 6 శాతంలోపే ద్రవ్యోల్బణం గణాంకాలు నమోదయ్యాయి. కానీ గత నెల మాత్రం ఆ హద్దు చెరిగిపోయింది. ఇక ఈ ఏడాది సెప్టెంబర్‌లో 5.49 శాతంగా ఉన్న చిల్లర ద్రవ్యోల్బణం.. నిరుడు అక్టోబర్‌లో 4.87 శాతంగానే ఉన్నది.

ఇదీ సంగతి..

అక్టోబర్‌లో కూరగాయలు, పండ్లు, వంట నూనెలు, ఇతర కొవ్వు పదార్థాల ధరలు బాగా పెరిగినట్టు తాజా గణాంకాల్లో తేటతెల్లమైంది. అంతకుముందు 3 నెలల నుంచే ఈ సెగ కనిపిస్తున్నా.. సంబంధిత ప్రభుత్వ వర్గాల చర్యల లేమితో తీవ్రత పెరుగుతూపోయింది. అయితే పప్పుధాన్యాలు, గుడ్లు, చెక్కెర, ఇతర తీపి పదార్థాలు, మసాలా దినుసుల ధరలు తగ్గుముఖం పట్టినా ప్రయోజనం లేకపోయింది. ప్రస్తుతం కిలో కూరగాయల ధర రకాన్నిబట్టి రూ.60-90 పలుకుతున్నది. పండ్ల ధరలు కిలో రూ.150-300 ఉండగా, ఆయిల్ ప్యాకెట్లు రూ.120-150 లేనిదే రావడం లేదు. ఇక కిలో చికెన్



గడిచిన ఏడాది కాలంలో ద్రవ్యోల్బణం ముఖచిత్రం

రూ.250కి అమ్ముతుండగా, డజను గుడ్లు రూ.70 పెట్టి కొనాలి. అన్ని రకాల పప్పుధాన్యాల ధరలు సైతం బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.120-180 మధ్యే ఉన్నాయి.

వడ్డీరేట్ల కోతలు లేనట్టేనా..

చాలాకాలం తర్వాత ఆర్బీఐ తమ ద్రవ్య విధానాన్ని కఠినం నుంచి న్యూట్రల్‌కు గత నెల్లోనే మార్చింది. దీంతో రాబోయే ద్రవ్యసమీక్షల్లో కీలక వడ్డీరేట్లు ఇకపై తగ్గే అవకాశాలున్నాయని అటు వ్యాపార, పారిశ్రామిక వర్గాలు, ఇటు రుణగ్రహీతలు సంబురపడ్డారు. కానీ తాజా ద్రవ్యోల్బణ గణాంకాలు ఈ ఆశలపై నీళ్లు చల్లుతున్నాయి. డిసెంబర్‌లో జరిగే ద్రవ్యసమీక్షలోనూ రెపోరేటు యథాతథంగానే ఉండేలా ఉన్నది. లేదంటే పెరిగేందుకూ ఆస్కారముందన్న అంచనాలు వినిపిస్తుండటం గమనార్హం.

కోలుకున్న పారిశ్రామికోత్పత్తి?

ఈ ఏడాది సెప్టెంబర్‌లో దేశీయ పారిశ్రామికోత్పత్తి వృద్ధి 3.1 శాతానికి పెరిగింది. అంతకుముందు నెల ఆగస్టులో ఇది మైనస్ 0.1 శాతానికే పరిమితమైంది. అయితే గనులు, తయారీ, విద్యుదుత్పత్తి రంగాల్లో మెరుగైన కార్యకలాపాలు పారిశ్రామికోత్పత్తి సూచీ (ఐఐపీ)ని పెంచాయని జాతీయ గణాంకాల కార్యాలయం తెలిపింది. కానీ ఈ జోష్ రాబోయే నెలల్లోనూ కొనసాగుతుందా? అన్న అనుమానాలు మాత్రం తీరడం లేదు. ఎందుకంటే గనుల రంగంలో వృద్ధిరేటు 0.2 శాతంగానే ఉండగా, విద్యుదుత్పత్తి 0.5 శాతంతోనే సరిపెట్టింది. తయారీలో మాత్రమే 3.9 శాతం ఉత్పాదకత రేటు కనిపిస్తున్నది. అంతేగాక క్యాపిటల్ గూడ్స్ విభాగం కార్యకలాపాలు మైనస్ 2.8 శాతంగానే ఉన్నాయి. ఇతర రంగాల్లోనూ గతంతో పోల్చితే వృద్ధి బాగా తగ్గింది. ఇక నిరుడు సెప్టెంబర్‌లో ఐఐపీ 6.4 శాతంగా ఉండటం గమనార్హం.

ఆహార ధరల సెగ

పెరుగుతున్న ఆహారోత్పత్తుల ధరలు.. రిటైల్ ద్రవ్యోల్బణాన్ని ఎగదోస్తున్నాయి. ఈ ఏడాది జూలైలో తగ్గినట్టే తగ్గి మళ్లీ వరుసగా ఆహార ద్రవ్యోల్బణం పెరుగుతూపోయింది. ఈ నేపథ్యంలోనే అక్టోబర్‌లో వినియోగదారుల ఆహార ధరల సూచీ (సీఎఫ్‌పీఐ) ఒక్కసారిగా 10.87 శాతానికి చేరింది. అంతకుముందు నెల సెప్టెంబర్‌లో ఇది 9.24 శాతంగా ఉండగా, గత ఏడాది అక్టోబర్‌లో 6.61 శాతంగానే ఉన్నది. దీనికి తగ్గట్టే సీపీఐలోనూ పెరుగుదల చోటుచేసుకున్నది. ఇక నగర, పట్టణ ప్రాంతాలతో పోల్చితే గ్రామాల్లోనే ద్రవ్యోల్బణం సెగ ఎక్కువగా కనిపిస్తున్నట్టు ఎన్ఎస్ఓ చెప్తున్నది. గత నెలలో గ్రామీణ ద్రవ్యోల్బణం రేటు 6.68 శాతంగా, పట్టణ ద్రవ్యోల్బణం రేటు 5.62 శాతంగా నమోదయ్యాయి.

స్ట్రింగ్ మెటావర్స్

ఆకర్షణీయం

హైదరాబాద్, నవంబర్ 12: ప్రముఖ టెక్నాలజీ సంస్థ స్ట్రింగ్ మెటావర్స్ ఆశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలల్లో రూ.137.82 కోట్ల ఆదాయంపై రూ.12.13 కోట్ల నికర లాభాన్ని గడించింది. ఈ సందర్భంగా కంపెనీ సీఈవో సంతోష్ అల్లురి మాట్లాడుతూ..కృత్రిమ మేధస్సు, బ్లాక్‌చెయిన్ కామర్స్ విభాగాలపై ప్రత్యేక దృష్టి సారించడంతో వచ్చేమూడేండ్లకాలంలో 100 శాతం వరకు వృద్ధిని సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. ప్రత్యేకంగా టెక్నాలాజికల్ అడ్వాన్స్‌మెంట్స్, వ్యూహాత్మక భాగస్వాములతో ఒప్పందాలు కుదుర్చుకోవడానికి ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం సంస్థకు అంతర్జాతీయంగా 20 లక్షల మంది యాక్టివ్ గేమింగ్ యూజర్లు ఉన్నారు.

నాట్కో లాభం 676 కోట్లు

NATCO

హైదరాబాద్, నవంబర్ 12: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికానికిగాను రూ.676 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది నాట్కో ఫార్మా. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.369 కోట్లతో పోలిస్తే 83 శాతం వృద్ధిని కనబరిచింది. అమ్మకాలు భారీగా పుంజుకోవడం వల్లనే లాభాల్లో భారీ వృద్ధి నమోదైందని కంపెనీ వర్గాలు వెల్లడించారు. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం రూ.1,031 కోట్ల నుంచి రూ.1,371 కోట్లకు చేరుకున్నట్లు బీఎస్‌ఈకి సమాచారం అందించింది. మరోవైపు, ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికిగాను రూ.2 ముఖ విలువ కలిగిన ప్రతిషేరుకు రూ.1.5 మధ్యంతర డివిడెండ్‌ను బోర్డు ప్రతిపాదించింది. ఈసారి డివిడెండ్ ప్రకటించడం ఇది రెండోసారి కావడం విశేషం.

భెల్ చేతికి టీఎస్‌టీపీపీ ప్రాజెక్ట్

న్యూఢిల్లీ, నవంబర్ 12: ప్రభుత్వ రంగ ఇంజినీరింగ్ దిగ్గజం భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ (బీహెచ్‌ఈఎల్ లేదా భెల్)కు జాతీయ బొగ్గు ఆధారిత విద్యుదుత్పత్తి సంస్థ (ఎన్టీపీసీ) నుంచి తెలంగాణ ప్రాజెక్టు దక్కింది. 2,400 మెగావాట్ల విద్యుదుత్పత్తి సామర్థ్యంతో నిర్మిస్తున్న తెలంగాణ సూపర్‌క్రిటికల్ థర్మల్ పవర్ ప్లాంట్ (టీఎస్‌టీపీపీ) ఏర్పాటులో ఎన్టీపీసీతో కలిసి పనిచేయబోతున్నట్టు మంగళవారం ఓ ప్రకటనలో భెల్ తెలిపింది. ఈ ప్రాజెక్టు కోసం నిర్వహించిన బిడ్డింగ్‌లో బీహెచ్‌ఈఎల్ అగ్రభాగాన నిలిచి విజయం సాధించింది. కాగా, ఎన్టీపీసీతో కుదిరిన ఒప్పందం కింద ప్లాంట్ డిజైన్, ఇంజినీరింగ్, నిర్మాణ తదితర పనులను భెల్ అందిస్తుంది. ఇప్పటికే ప్రధాన ప్లాంట్ నిర్మాణం కోసం కనీస ఇంజినీరింగ్ పనుల్ని మొదలుపెట్టాలంటూ ఎన్టీపీసీ నుంచి లిమిటెడ్ నోటీస్ టు ప్రొసీడ్ (ఎల్ఎన్‌టీపీ)ను సైతం భెల్ అందుకున్నది. ఇదిలావుంటే 800 మెగావాట్ల సామర్థ్యం కలిగిన 3 ప్లాంట్లతో ఈ రెండో దశ ప్రాజెక్టు రూపుదిద్దుకోనున్నది. మొత్తం 4వేల మెగావాట్ల విద్యుదుత్పత్తి సామర్థ్యం కలిగిన ఈ ప్రాజెక్టులో తొలి దశ కింద రెండు 800 మెగావాట్ల విద్యుదుత్పత్తి ప్లాంట్లున్నాయి. వీటిలో ప్రస్తుతం ఉత్పత్తి కూడా జరుగుతున్నది. కాగా, రాష్ట్ర పునర్విభజన చట్టం ప్రకారం పూర్తిగా తెలంగాణ అవసరాల కోసం ఈ 4వేల మెగావాట్ల ప్రాజెక్టును కేటాయించారు. పెద్దపల్లి జిల్లా రామగుండంలోని ఎన్టీపీసీ ఆవరణలో ఈ టీఎస్‌టీపీపీని తెస్తున్నారు. ఇటీవలే ఎన్టీపీసీ కార్పొరేట్ బోర్డు డైరెక్టర్ల సమావేశంలో రెండో దశ ప్లాంట్ నిర్మాణం కోసం రూ.29,344.85 కోట్ల అంచనా పెట్టుబడికి ఆమోదం లభించింది. దేశవ్యాప్తంగా ఎన్టీపీసీ ఏర్పాటుచేస్తున్న థర్మల్ పవర్ ప్లాంట్లలో 57 శాతం బీహెచ్‌ఈఎల్ భాగస్వామ్యంతోనే పూర్తవుతున్నాయి. ఈ క్రమంలో టీఎస్‌టీపీపీ ప్రాజెక్టు ఇరు సంస్థల భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయనున్నది.

హైదరాబాద్‌లో గ్లోబల్ లాజిక్ సెంటర్

హైదరాబాద్, నవంబర్ 12: హిటాచీ గ్రూపునకు చెందిన డిజిటల్ ఇంజినీరింగ్ సంస్థ గ్లోబల్‌లాజిక్..హైదరాబాద్‌లో నూతన డెలివరీ సెంటర్‌ను ఏర్పాటు చేసింది. 600 మంది ఇంజినీర్లు కెపాసిటీ సామర్థ్యం కలిగిన ఈ డెలివరీ సెంటర్‌ను రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..ఐటీ హబ్‌గా కొనసాగుతున్న హైదరాబాద్‌లోకి మరో గ్లోబల్ సంస్థ డెలివరీ సెంటర్‌ను ప్రారంభించిందని, తెలంగాణకు ఇది మరో మైలురాయి వంటిదని, డిజిటల్ ఇన్నోవేషన్, ట్రాన్స్‌ఫర్మేషన్‌లో గ్లోబల్ లీడర్‌గా రాష్ట్రం ఎదుగుతున్నదన్నారు. ప్రస్తుతం నగరంలో 220 జీసీసీ(గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్లు) ఉన్నాయన్నారు. వచ్చే మూడేండ్లకాలంలో ఈ డెలివరీ సెంటర్ సామర్థ్యం 2 వేలకు పెంచుకోనున్నట్లు కంపెనీ వర్గాలు వెల్లడించాయి.

78 వేల దిగువకు పసిడి

• ఒకేరోజు 1,750 తగ్గిన తులం ధర

న్యూఢిల్లీ, నవంబర్ 12: బంగారం క్రమంగా దిగొస్తున్నది. రికార్డు స్థాయికి ధరలు చేరుకోవడంతో కొనుగోళ్లు పూర్తిగా నిలిచిపోయాయి. దీంతో వరుసగా రెండోరోజు మంగళవారం పుత్తడి భారీగా దిగొచ్చింది. దేశీయంగా డిమాండ్ అంతంత మాత్రంగానే ఉండటం, గ్లోబల్ మార్కెట్లో అతి విలువైన లోహాల ధరలు తగ్గుముఖం పట్టడం ధరలు తగ్గడానికి ప్రధాన కారణమని ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ వర్గాలు వెల్లడించాయి. ఢిల్లీ బులియన్ మార్కెట్లో 99.9 శాతం ప్యూరిటీ కలిగిన తులం బంగారం ధర రూ.1,750 తగ్గి రూ.77,800కి దిగొచ్చింది. అంతకుముందు ఇది రూ.79,550గా ఉన్నది. 99.5 క్యారెట్ ధర రూ.1,750 తగ్గి రూ.77,400కి తగ్గింది. ఇటు హైదరాబాద్ బులియన్ మార్కెట్లో 24 క్యారెట్ తులం బంగారం ధర రూ.1,470 తగ్గి రూ.77,290కి దిగొచ్చింది.

భారీగా తగ్గిన వెండి

బంగారంతోపాటు వెండి ధరలు భారీగా తగ్గాయి. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి కొనుగోళ్లు పూర్తిగా నిలిచిపోవడంతో ఢిల్లీలో కిలో వెండి రూ.2,700 తగ్గి రూ.91,300కి తగ్గింది. అంతకుముందు ఇది రూ.94 వేలుగా ఉన్నది. ఇటు హైదరాబాద్ మార్కెట్లో కిలో వెండి రూ.2 వేలు తగ్గి రూ.1.02 లక్షల నుంచి లక్ష రూపాయలకు దిగింది.

రుణాల చెల్లింపుల్లో

ఎంటీఎన్ఎల్ విఫలం

న్యూఢిల్లీ, నవంబర్ 12: ఎంటీఎన్ఎల్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. రుణాల చెల్లింపుల్లో సంస్థ విఫలమైంది. పలు బ్యాంకుల వద్ద తీసుకున్న రూ.5,492 కోట్ల రుణంతోపాటు రూ.234.28 కోట్లు వడ్డీ కలుపుకొని రూ.5,726.29 కోట్ల రుణాలు చెల్లింపుల్లో విఫలమైంది. ఈ విషయాన్ని సంస్థ బీఎస్ఈకి సమాచారం అందించింది. ప్రస్తుతం సంస్థకు రూ.32,097.28 కోట్ల రుణాలు ఉన్నాయి. కంపెనీ కన్సాలిడేటెడ్ రూ.798 కోట్ల ఆదాయంతో పోలిస్తే 40 రెట్ల అధికంగా రుణాలు ఉన్నాయి.

మార్కెట్లు నేలచూపులు

5 లక్షల కోట్ల సంపద ఆవిరి

ముంబై, నవంబర్ 12: దేశీయ స్టాక్ మార్కెట్లు కుప్పకూలాయి. అంతర్జాతీయ మార్కెట్లు తీవ్ర ఒడిదుడుకులకు లోనుకావడంతోపాటు దేశీయంగా బ్యాంకింగ్, పవర్, వాహన రంగ షేర్లు క్రయ విక్రయాలు జోరుగాసాగడంతో సూచీలు ఒక్క శాతానికి పైగా నష్టపోయాయి. వరుసగా ఐదు రోజులుగా భారీగా లాభపడిన సూచీలు మంగళవారం అంతే వేగంతో నష్టపోయాయి. లాభాల్లో ప్రారంభమైన సూచీలకు మధ్యాహ్నం తర్వాత అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన ప్రతికూల సంకేతాలు నష్టాలవైపు నడిపించాయి. ఇంట్రాడేలో 950 పాయింట్ల స్థాయిలో నష్టపోయిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు 820.97 పాయింట్లు లేదా 1.03 శాతం కోల్పోయి 78,675 వద్దస్థిరపడింది. మరో సూచీ నిఫ్టీ 257.85 పాయింట్లు లేదా 1.07 శాతం కోల్పోయి 23,883.45 వద్ద ముగిసింది. స్టాక్ మార్కెట్లు భారీ నష్టపోవడంతో మదుపరులు లక్షల కోట్ల సంపదను కోల్పోయారు. దీంతో బీఎస్ఈలో లిస్టైన కంపెనీల మార్కెట్ క్యాపిటల్ రూ.5,29,525.42 కోట్లు కరిగిపోయి రూ.4,37,24,546.57 కోట్లు(5.18 ట్రిలియన్ డాలర్లు)కు పడిపోయింది.

సర్వేలో వివరాలు స్పష్టంగా నమోదు చేయాలి

సీసీసీ నస్పూర్, నవంబర్ 12 : సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే ప్రక్రియలో కుటుంబ సభ్యుల వివరాలను స్పష్టంగా నమోదు చేయాలని మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ సిబ్బందికి సూచించారు. నస్పూర్ మున్సిపల్ పరిధిలోని 13, 25వ వార్డుల్లో మంగళవారం ఆయన పర్యటించారు. సర్వే జరుగుతున్న తీరును పరిశీలించారు. సిబ్బందికి పలు సలహాలు, సూచనలు చేశారు. ప్రజలతో కుటుంబ సర్వేపై మాట్లాడారు. వారి అనుమానాలను నివృత్తి చేశారు. సర్వే ప్రక్రియలో ఇండ్ల జాబితా ఇది వరకే పూర్తి అయిందని, కుటుంబ సభ్యుల సర్వేలో పొరపాట్లకు తావు లేకుండా వివరాలు స్పష్టంగా నమోదు చేయాలని, నమూనాలో ఉన్న అన్ని అంశాలను పూర్తించాలని తెలిపారు. ఎన్యూమరేటర్లు తమకు కేటాయించిన బ్లాక్‌లలో పూర్తిస్థాయిలో కుటుంబ సభ్యుల వివరాలను నిర్ణీత నమూనాలో నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

సర్వే ప్రక్రియ పరిశీలన

వాంకిడి, నవంబర్ 12 : మండల కేంద్రంలో కొనసాగుతున్న ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వేను కుమ్రం భీం ఆసిఫాబాద్ అదనపు కలెక్టర్ దీపక్ తివారీ పరిశీలించారు. బీసీ కాలనీలో ప్రజల నుంచి ఎన్యూమరేటర్లు సేకరిస్తున్న వివరాల నమోదుపై ఆరా తీశారు. ప్రతిఒక్కరూ నిర్భయంగా వివరాలు చెప్పవచ్చని తెలిపారు. ఆయన వెంట మండల ప్రత్యేకాధికారి బిక్కు నాయక్, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఎంపీవో ఖాజా అజీజుద్దీన్, పంచాయతీ కార్యదర్శి శివకుమార్, సూపర్‌వైజర్ సందీప్, ఎన్యూమరేటర్, కాలనీవాసులు తదితరులు ఉన్నారు.

భీమారం ఎంపీడీవో కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేస్తున్న స్థానికులు

కోతులను తరలించాలని నిరసన

● ఎంపీడీవో కార్యాలయం వరకు ర్యాలీ

● ప్రజావాణిలో ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదంటున్న స్థానికులు

భీమారం, నవంబర్ 12 : భీమారం బస్టాండ్ ప్రాంతంతో పాటు వివిధ కాలనీల్లో విచ్చలవిడిగా స్వైర విహారం చేస్తున్న కోతులను తరలించాలని స్థానికులు మంగళవారం నిరసన చేపట్టారు. భీమారం ఆవుడం క్రాస్ రోడ్డు నుంచి ఎంపీడీవో కార్యాలయం వరకు ర్యాలీ తీశారు. ఎంపీడీవో కార్యాలయం వద్ద ప్లకార్డులు ప్రదర్శిస్తూ ఆందోళన చేపట్టారు. కొంత కాలంగా ప్రతి సోమవారం జరిగే ప్రజావాణిలో ఫిర్యాదులు చేస్తున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో స్థానికులు మద్దెర్ల సంతోష్, ముక్త రఘు, రాపెల్లి రాజన్న యాదవ్, నర్ర గౌతం రెడ్డి, రాపెల్లి రాజన్న యాదవ్, పెండ్రి శ్రీనివాస్, కోట్రంగి రవీందర్, బానోత్ విజయ్ కుమార్ నాయక్, తువ్వ మల్లేశ్, బెల్లం కొండ భరత్ రెడ్డి, కుమార్, తువ్వ కుమార్, మాజీ జడ్పీటీసీ రాజ్‌కుమార్ నాయక్ పాల్గొన్నారు.

'కంచె వేస్తే ఊరుకోం'

మందమర్రి రూరల్, నవంబర్ 12 : రోడ్డుకు అడ్డంగా కంచె వేస్తే ఊరుకోబోమని శంకర్ పల్లి గ్రామస్తులు స్పష్టం చేశారు. మందమర్రి ఏరియాలోని కేకే-5 గని పక్క నుంచి శంకర్పల్లి వెళ్లే రోడ్డుకు అడ్డంగా మంగళవారం సింగరేణి యాజమాన్య కంచె వేయాలని ప్రయత్నించగా, గ్రామస్తులు అక్కడకు చేరుకొని బైఠాయించారు. గ్రామస్తులు మాట్లాడుతూ.. శంకర్‌పల్లికి వెళ్లేందుకు 40-50 ఏళ్లుగా ఇదే రోడ్డును వినియోగించుకుంటున్నామని తెలిపారు. ఆ రోడ్డుకు అడ్డంగా కంచె వేస్తే మరో మార్గం గుండా మండల కేంద్రానికి రావాలంటే 8 కిలోమీటర్లు అదనంగా ప్రయాణించాల్సి ఉంటుందని వివరించారు. రోడ్డు కింది భూగర్భ గని బొగ్గు తీత పనులు జరుగుతున్నాయని, ఆ ఏరియా అంతా ప్రమాదకరంగా ఉంటుందని గని అధికారులు తెలిపారు. ఏది ఏమైనా ఇది వరకు వెళ్లినట్లే దారి ఉంచాలని, లేకపోతే ఆందోళన చేస్తామని గ్రామస్తులు భీష్మించడంతో రోడ్డుకు సింగరేణి యాజమాన్యం ఇరు వైపులా కంచె వేయించి హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసింది.

బైఠాయించిన శంకర్‌పల్లి గ్రామస్తులు

గూడెంలో కొనసాగుతున్న 'కార్తీక' సందడి

స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

దండేపల్లి, నవంబర్ 12 : దండేపల్లి మండలం గూడెం రమాసహిత శ్రీ సత్యనారాయణ స్వామి ఆలయంలో 'కార్తీక' సందడి నెలకొన్నది. కార్తీక మాసం సందర్భంగా మంగళవారం పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడంతో రద్దీగా కనిపించింది. ముందుగా భక్తులు గోదావరిలో పుణ్యస్నానాలు చేసి, కార్తీక దీపాలు వదిలారు. గంగమ్మకు పూజలు చేశారు. అనంతరం గుట్ట కింద రావి చెట్టు వద్ద, గుట్టపై ధ్వజ స్తంభం వద్ద దీపాలు వెలిగించారు. ఆ తర్వాత స్వామివారిని దర్శించుకొని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయంలో పలువురు సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు ఆచరించారు. అనంతరం అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు చేశారు. దీంతో ఆలయంలో భక్తుల సందడి నెలకొంది. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, సిబ్బంది ఉన్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు కొక్కిరాల రఘుపతిరావు ట్రస్ట్ ఆధ్వర్యంలో పులిహోర, మజ్జిగ, తాగునీటిని అందించారు. స్థానిక నాయకులు గడ్డం త్రిమూర్తి, నాయకులు సృజన్, నవీన్, శ్రీధర్, రమేశ్, రాజయ్య, అనిల్ తదితరులున్నారు.

ఆర్టీసీ డీఎంపై చర్యలు తీసుకోవాలి

ఆసిఫాబాద్ టౌన్, నవంబర్ 12 : ఆసిఫాబాద్ ఆర్టీసీ డిపోలో కార్మికులను వేధింపులు, భయభ్రాంతులకు గురిచేస్తున్న డీఎం విశ్వనాథ్‌పై క్రిమినల్ కేసులు నమోదు చేసి, ఉద్యోగం నుంచి వెంటనే తొలగించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు టీ దివాకర్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఆసిఫాబాద్ డిపోలో మంగళవారం పర్యటించి, కార్మికులను కలిశారు. వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విశ్వనాథ్ డీఎం అయినప్పటి నుంచి డిపోలో అవినీతి అక్రమాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయని ఆరోపించారు. పల్లె వెలుగు బస్సుల్లో ప్రయాణిస్తున్న ప్రయాణికులపై సూపర్ ఎక్స్‌ప్రెస్ బస్ చార్జీలు వసూలు చేస్తున్నాడని, ఇలాంటి అక్రమాలకు పాల్పడిన అతడిపై ఆర్ఎం చర్యలు తీసుకోకపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తుందని పేర్కొన్నారు. ప్రశ్నించిన సిబ్బందిని భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. అతడిపై చర్యలు తీసుకోవాలని, లేకపోతే కార్మిక సంఘాల నాయకులతో కలిసి ఆర్టీసీ డిపోను భారీ ఎత్తున ముట్టడిస్తామని స్పష్టం చేశారు.

దరఖాస్తుల స్వీకరణ

ఆసిఫాబాద్ టౌన్, నవంబర్ 12 : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థలో వివిధ పోస్టుల భర్తీకి అర్హత గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ రమేశ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్టెనో-టైపిస్ట్-1, టైపిస్ట్- కమ్ అసిస్టెంట్, రికార్డ్ అసిస్టెంట్-1 పోస్టులను భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 22వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, న్యాయ సేవా సదన్, జిల్లా న్యాయస్థానంకు చేరేలా రిజిస్టర్డ్ పోస్ట్/కొరియర్ ద్వారా మాత్రమే దరఖాస్తు పంపించాలని తెలిపారు. అభ్యర్థులు దరఖాస్తు చేసుకునే పోస్ట్ వివరాలు కవర్‌పై తప్పనిసరిగా రాయాలని సూచించారు. 23 నుంచి 28వ తేదీ వరకు దరఖాస్తులను పరిశీలించి, అర్హులైన అభ్యర్థులకు డిసెంబర్ 2వ తేదీన హాల్ టికెట్లు జారీ చేయనున్నటుల తెలిపారు. డిసెంబర్ 7న ఉదయం 10.30 గంటలకు రికార్డ్ అసిస్టెంట్, మధ్యాహ్నం 3 గంటలకు స్టెనో - టైపిస్ట్, టైపిస్ట్-కమ్ అసిస్టెంట్ పోస్టులకు జిల్లా కేంద్రంలోని న్యాయస్థాన భవన సముదాయంలో రాత పరీక్ష ఉంటుందని వివరించారు. ఇతర వివరాలకు https://asifabad.dcourts.gov.in వెబ్‌సైట్‌లో సంప్రదించవచ్చని, ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

'ఓటు వేయలేదని కక్ష సాధింపు చర్యలు'

మంచిర్యాల (ఏసీసీ), నవంబర్ 12 : తనకు ఓటు వేయలేదని వ్యాపారస్తులపై మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేం సాగర్ రావు కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ రావు ఆరోపించారు. అక్రమ కట్టడాల పేరుతో కూల్చివేతలకు పాల్పడుతున్నారని విమర్శించారు. జిల్లా కార్యాలయంలో మంగళవారం మాట్లాడారు. మున్సిపాలిటీలో బడ్జెట్ కేటాయించకుండా, డీపీఆర్ రూపొందించకుండా అక్రమ కట్టడాల పేరుతో కూల్చివేతలు చేపట్టి, మార్కెట్ రోడ్‌లో భారీ కందకాలు తవ్వారన్నారు. గోదావరిపై వంతెన, రైల్వే ఫ్లై ఓవర్ తదితర అభివృద్ధి పనులపై దృష్టి పెట్టకుండా, కేవలం వ్యాపారస్తులను ఇబ్బందులకు గురిచేసేలా వ్యవహరించడం తగదని హితవు పలికారు. జాతీయ రహదారి 63 విస్తరణలో భూములు కోల్పోతున్న రైతులను ఆదుకోవాలని కలెక్టర్ దీపక్ కుమార్‌ను కలిసి, విన్నవించారు. లక్షెట్టిపేట, హాజీపూర్ రైతులు గతంలో ఎల్లంపెల్లి ప్రాజెక్టులో భూములు కోల్పోయారని, రహదారి విస్తరణలో భూములు కోల్పోతే రోడ్డున పడుతారని ఆందోళన వ్యక్తం చేశారు.

34 కొనుగోలు కేంద్రాలు

ఆసిఫాబాద్ టౌన్, నవంబర్ 12 : జిల్లాలో 34 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు కుమ్రం భీం ఆసిఫాబాద్ పౌరసరఫరాల శాఖ మేనేజర్ నరసింహారావు, జిల్లా సహకార ఆడిట్ అధికారి రబ్బాని మంగళవారం ఉమ్మడి ప్రకటనలో తెలిపారు. ప్రాథమిక సహకార సంఘాల ఆధ్వర్యంలో 21, మహిళా సంఘాల ఆధ్వర్యంలో 13 కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. వ్యవసాయ శాఖ అంచనాల ప్రకారం 40వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసేందుకు నిర్ణయించినట్లు తెలిపారు. ఇతర జిల్లాలతో పోలిస్తే ఆసిఫాబాద్‌లో పంట కొంత ఆలస్యంగా వస్తున్నదని పేర్కొన్నారు.

విజయవంతమైన 48వ రోజు
సుదర్శన్ 35 ఎంఎం ఎ/సి - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్
11.30,3.00,6.00,9.30
ENJOY 4K LASER PROJECTION & DOLBY ATMOS SOUND
INOX జి.ఎస్.ఎమ్ - మదీనాగూడ 4.00PM
PVR నెక్షస్ మాల్ - కూకట్‌పల్లి 1.50PM
PVR పివిఆర్ - ఎర్రమంజిల్ 1.20PM
రాధిక 70 ఎంఎం ఎ/సి - వరంగల్
SVC తిరుమల 70 ఎంఎం ఎ/సి - ఖమ్మం
లలితామహల్ 70 ఎంఎం ఎ/సి - నిజామాబాద్
వెంకటేశ్వర 70 ఎంఎం ఎ/సి - మహబూబ్‌నగర్

BLOCKBUSTER నేడే చూడండి

శ్రీసాయిరాజా 70 ఎంఎం ఎ/సి - ముషీరాబాద్ 11.30,2.30

PVR ఆర్.కె - బంజారాహిల్స్ 2.15PM	PVR PRISM మాల్-గచ్చిబౌలి 11.00PM	Cinépolis లులు మాల్ - కూకట్‌పల్లి 7.40PM	ASIAN సినీ స్క్వేర్ -ఉప్పల్ 7.45PM
PVR సెంట్రల్‌మాల్- పంజాగుట్ట 8.00PM	INOX ఐనాక్స్ - బంజారాహిల్స్ 1.30PM	Cinépolis CCPL- మల్కాజ్‌గిరి 11.00PM	ఏఏఏ ఎ/సి - అమీర్‌పేట్ 4.25PM
PVR ఇనార్బిట్‌మాల్- మాదాపూర్ 1.35PM	INOX జి.ఎస్.ఎమ్ - మదీనాగూడ 10.20,7.40	Cinépolis మంత్రామాల్ - అత్తాపూర్ 10.50PM	AMB ఏఎంబి ఎ/సి -గచ్చిబౌలి 7.05PM
PVR నెక్షస్ మాల్ - కూకట్‌పల్లి 1.00,10.55	INOX ఎం.పి.మాల్ - కాచిగూడ 2.00PM	Cinépolis సుధ ఎ/సి - శాలిబండ 11.10PM	PRASADS ప్రసాద్ - ఎన్.టి.ఆర్.గార్డెన్స్ 9.00,8.20PM
PVR గలేరియా - పంజాగుట్ట 2.10,7.55	INOX సత్యనెక్లెస్ మాల్స్ - కూకట్‌గూడ 5.05,10.50	మిరాజ్ సినిమాస్ - దిల్‌సుఖ్‌నగర్ 4.50PM	అపర్ణసినిమాస్ - నల్లగండ్ల 5.05PM
PVR పివిఆర్- ఎర్రమంజిల్ 4.40,10.40	INOX అశోక ఎ/సి - వై.జంక్షన్ 4.35PM	మిరాజ్ సినిమాస్ - ఐడిపిఎల్ 4.30PM	సినీప్లానెట్ ఎ/సి - కొంపల్లి 4.25PM
PVR పివిఆర్ - మూసారంబాగ్ 4.35PM	AMR ఏఎంఆర్- మౌలాలి 4.45PM	మిరాజ్ సినిమాస్ - చందానగర్ 4.30PM	లక్ష్మీకళ - మూసాపేట్ 6.20PM
PVR ప్రెస్టన్ ప్రైమ్ - గచ్చిబౌలి 4.50PM	MOVIETIME ప్లాటినమ్-అమీర్‌పేట్ 4.30PM	రాఘవేంద్ర- మల్కాజ్‌గిరి 5.10PM	సినీమార్ట్- ఆర్.సి.పురం 10.45PM
PVR ఐకాన్ - హైటెక్ సిటీ 8.00PM	MOVIETIME స్కైమాల్-సనత్‌నగర్ 1.30PM	లక్ష్మీనరసింహ- మియాపూర్ 4.05PM	ఎం.జె.ఆర్ - నారపల్లి 4.30PM
PVR ATRIUM మాల్-గచ్చిబౌలి 8.00PM	MOVIETIME ప్లాటినమ్ - గచ్చిబౌలి 5.15PM		GPR జిపిఆర్-కూకట్‌పల్లి 1.15PM

సిఎన్ఎన్ గెలాక్సీ - ఖమ్మం, వెంకటేశ్వర ఎ/సి - మంచిర్యాల, రుక్మిణి - సంగారెడ్డి, సినీమ్యాక్స్ - మెదక్, శ్రీకృష్ణ - మహబూబ్‌నగర్
MYTHRI MOVIE DISTRIBUTORS LLP